క్లుప్తంగా

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి



గ్రంథాలయ కమిటీ సభ్యులకు సాహిత్యం పుస్తకాలు బహూకరిస్తున్న ఇందుకూరి

గణపవరం: మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే సాహిత్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయానికి ఆయన తెలుగు, ఆంగ్ల భాషకు సంబంధించిన సాహిత్య పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని విజ్ఞాన వంతులు కావాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పనవీడులో కార్తీక వన సమారాధన

పెదపాడు: అప్పనవీడులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధి బాణాల నర్సింహారావు, సత్యవతి దంపతులు ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ వన సమారాధనలో అప్పనవీడులోని పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా కుర్చీలాట నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు ఆసంఘ నాయకులు పాల్గొన్నారు.

శివ పీఠం వద్ద వేలాది మందికి అన్న సమారాధన



భీమడోలులో అన్న ప్రసాదాలను స్వీకరిస్తున్న మాలధారులు

భీమడోలు: కార్తీకమాసం చివరి ఆదివారం భీమడోలు గోదావరి కాల్వ గట్టుపై గల పార్వతీ సమేత భీమేశ్వర శివ దీక్షా పీఠం మాల ధారులు కార్తీక మాస వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. తొలుత ఆలయంలో మాలధారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసారు. ఈ పీఠం వద్ద భీమడోలుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు శివ దీక్ష చేపట్టారు. గురుస్వామి పేరాబత్తుల వెంకటేశ్వరరావు, పీఠం నిర్వాహకులు సంయుక్త ఆధ్వర్యంలో మాలధారులకు. 3వేల మంది గ్రామస్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

అయ్యప్ప మాలధారులకు బిక్ష ఏర్పాటు



పెదవేగిలో అయ్యప్ప మాలధారులకు బిక్షఏర్పాటుచేసిన దృశ్యం

పెదవేగి : అయ్యప్ప మాల ధరించి, నిష్టతో పూజలు నిర్వహిస్తూ 40 రోజులపాటు దీక్ష చేసే భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యకార్యమని పెదవేగికి చెందిన అయ్యప్ప భక్తుడు తొంటా తాతయ్యస్వామి అన్నారు. ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి దంపతులు పెదవేగి సాయిబాబా ఆలయం దగ్గర నిర్వహించే అయ్యప్ప మాలధారులకు ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనకు ఆర్థిక సాయం అందించారు. అన్న సమారాధన ఏర్పాట్లను పర్యవేక్షించిన తాతయ్య మాట్లాడుతూ 14 ఏళ్లుగా సాయిబాబా ఆలయం వద్ద అయ్యప్ప మాలధారులకు అన్న సమా రాధన నిర్వహిస్తున్నామని చెప్పారు. అయ్యప్ప స్వాములు బెజవాడ నాగరాజు, సింహాద్రి మాణిక్యాలరావు, శ్రీనివాసరావు, బలరామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా కమిటీలను నియమించాలి

దెందులూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానవ హక్కుల కమిషన్ జిల్లా కమిటీలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ కోరారు. శింగవరం ఎన్‌హెచ్‌ఎ ప్రత్యేక హాలు వద్ద భీమడోలు మండలం దళిత నాయకులు జోగులమూడి రవికుమార్‌తో కలిసి ఆయన ఆదివారం మాట్లాడారు. దశాబ్దాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానవహక్కుల పరిరక్షణకు జిల్లా కమిటీల నియామకంలో తీవ్ర నిర్లక్ష్యం చూపారని ఆయన అన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ఏలూరు(మెట్రో): జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ఈ నెల 11న సోమవరం ఉదయం 10 గంటల నుంచి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో కలెక్టరు, జిల్లా జాయింటు కలెక్టరు, జిల్లా స్థాయి అధికారులందరూ హాజరై అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

తుపాను గండాలతో రైతుల బెంబేలు



బాపిరాజుగూడెంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భీమడోలు: మరో తుపాను హెచ్చరికలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. మిచాంగ్ తుపాను నష్టాల నుంచి ఇంకా తేరుకోని అన్నదాతలకు మరో తుపాను వారంలో రోజుల్లో సంభవిస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతోంది. దీనితో సంబంధిత అధికార యంత్రాంగం రైతులను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 16న ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, తద్వారా ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు పంట తడిసి పోవడంతో ప్రభుత్వం నిబంధనలను సడలించి రైతులందరి వద్ద గల చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని ఆదేశించింది. దీనితో పాటు కొన్ని రోజులుగా వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, ప్రభుత్వం ఆంక్షలు సడలింపులతో రైతుల్లో భరోసా ఏర్పడింది. దీనితో పాటు ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం నగదు రెండు, మూడు రోజుల్లో వారి ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఎట్టి పరిస్థితుల్లో దళారులకు కాకుండా ప్రభుత్వానికి విక్రయించేందుకు సముఖతను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించే భరోసా చర్యలతో రైతుల్లో మనోధైర్యం ఏర్పడింది. రైతన్నలు తమ ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించే పనిలో ఉన్నారు. రైతులు రహదారులపై ధాన్యాన్ని అరబోసుకుని తేమ శాతం వల్ల కలిగే నష్టాలను తగ్గించుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా స్థాయి అధికారులు మండలాల్లో రైతుల్లో పర్యటించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీనితో గ్రామాల్లో లారీల్లో ధాన్యాన్ని సమీపంలోని మిల్లులకు యుద్ధ ప్రాతిపదికన తరలిస్తున్నారు. మండలంలో 13వేల ఎకరాల్లో సార్వా సాగు చేయగా 30వేల మెట్రిక్ ధాన్యం దిగుబడులు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారి ఖాతాల్లో నగదును జమ చేసారు. ఇంకా 12వేల మెట్రిక్ టన్నుల్లో ఇప్పటి వరకు 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు కమీషన్‌దారులకు ప్రభుత్వం మద్దతు ధరకు విక్రయించారు. మిగిలిన 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దనే ఉంది. వాటిని రెండు, మూడు రోజుల్లో మిల్లులకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి ఎస్‌పీవీ ఉషారాణి ఆదివారం రాత్రి తెలిపారు. మరో తుపాను తాకిడిపై రైతులు ఇప్పటికే అప్రమత్తం చేశామని, రైతుల నుంచి ధాన్యాన్ని మిల్లులకు యుద్ధ ప్రాతిపదికన చేరవేస్తామని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

అండగా ఉన్నా..ధైర్యంగా ఉండండి

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు అండగా ఉన్నానని ధైర్యంగా ఉండాలంటూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలంలోని బాపిరాజుగూడెం, కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాల్లో మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను, తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆదివారం బాధిత రైతులకు అధైర్య పడవద్దని, జగనన్న ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబోస్తున్న కూలీలు



పాతూరు వద్ద తరలింపు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

నేడు గుండుగొలనులో 'గడపగడపకు'

భీమడోలు: గుండుగొలను సచివాలయం 1 పరిధిలో ఈనెల 11వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తెలిపారు. నాలుగున్నర ఏళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే వాసుబాబు తెలియజేస్తూ వారికి లబ్ధి పత్రాలను అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వృద్ధాశ్రమంలో రగ్గుల పంపిణీ

దెందులూరు : సానిగూడెం వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం ఏలూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 మంది వృద్ధులకు రగ్గులు, స్వీట్లు పంపిణీ చేశారు. సేవాభావంతో వృద్ధులకు అన్ని తామై సేవలందిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులను ఏలూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ అభినందించారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు శాఖా గ్రంథాలయాల్లో తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని సామూహిక పుస్తక పఠనం చేశారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు.గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధులు రికవరీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఏసుబాబు, పులిపాటి శ్యామలాదేవి

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో రూ. 1.09 కోట్లకుపైగా నిధులు దుర్వినియోగం నిర్ధారణ అనంతరం సర్పంచ్, గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా ఖాతరు చేయని డీపీఓకు వ్యతిరేకంగా ఆదివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా నేతలు నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిధులు రికవరీ చేయాలని నినదించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం అంశంపై గత నెలలో డీపీఓను అడిగితే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పి 15 రోజులైందని గుర్తు చేశారు. కలెక్టర్ ఆదేశాలు ఎందుకు ఖాతరు చేయడం లేదో అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి పార్టీలకు అతీతంగా దెందులూరు గ్రామ పంచాయతీ ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి మాట్లాడుతూ డీపీఓ నిర్లక్ష్యం వహించడం తగదని అన్నారు.

విభిన్న ప్రతిభావంతుడికి ఎమ్మెల్యే కొఠారు చేయూత



విభిన్న ప్రతిభావంతుడి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేయూతనందించారు. తన ద్విచక్ర వాహనం మరమ్మతుకు గురైందని, దీంతో ఇబ్బంది పడుతున్నట్టు ఎమ్మెల్యేకు ఆయన చెప్పారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ద్విచక్రవాహనం, ఇతర అవసరాలు నిమిత్తం చేయూతనందించారు.

బాధితులకు పరామర్శ: ఏలూరు రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అమ్మపాలెం గ్రామానికి చెందిన నాల్గవ వార్డు సభ్యులు బాలిన సురేష్‌ను ఆదివారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించారు. త్వరతగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ చల్లగోళ్ళ వెంకటేశ్వరరావు (భూస్వామి), అమ్మపాలెం నాయకులున్నారు.

దురలవాట్లే క్యాన్సర్‌కు కారణం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

గణపవరం: ధూమపానం, మద్యపానం, గుట్కా, పాన్ నమలడం వంటి దురలవాట్ల వల్ల క్యాన్సర్ వ్యాధికి గురవుతారని ప్రముఖ అంకాలజిస్ట్ డా.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన, నిర్ధారణ, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. సదస్సులో శ్రీకాంత్ మాట్లాడుతూ ఇటీవల క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోందని, దీనికి జన్యుపరమైన కారణాలతోపాటు దురలవాట్లు కారణాలవుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని, శరీరంలో కంతులు, గడ్డలు వంటివి ఏర్పడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అందుబాటులోఉన్న వివిధ చికిత్సలను వివరించారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ మంచి అలవాట్లు, ఆహార నియమాలు, మెరుగైన జీవనశైలి కలిగి ఉండి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సదస్సులో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, కార్యదర్శి సుభాన్, నిడమర్రు మండలశాఖ అధ్యక్షుడు సీహెచ్ నర్సింహమూర్తి గణపవరం మండల యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజ మార్పులో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



యూటీఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజ మార్పులో ఉపాధ్యాయుడు కీలకంగా మారాలని పీడీఎఫ్ పూర్వ ఫ్లోర్ లీడర్ వీ. బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు ప్రతినిధుల సభ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన విద్యా విధానం శాస్త్రీయ విద్యను అందించే దిశగా మంచి బడికి పునాదులు వేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి బీ. గోపి మూర్తి ఆర్థిక నివేదికను, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎం కుమార్ రాజా పత్రిక నివేదికను, ఆడిట్ కన్వీనర్ మల్లేశ్వరరావు ఆడిట్ నివేదికను, ప్రచురణ కమిటీ చైర్మన్ హనుమంతరావు ప్రచరణ నివేదికను, సహాధ్యక్షులు ఏ. కుసుమకుమారి మహిళా ఉద్యమ నివేదికలను ప్రవేశపెట్టారు.

మహిళపై దాడి

దెందులూరు: నేషనల్ హైవే సోమవరప్పాడు వద్ద ఆదివారం రాత్రి ఏలూరు రూరల్ మండలం వైఎస్సార్ కాలనీకి చెందిన మహిళను కారులో వచ్చిన వ్యక్తి కారులో ఎక్కించుకుని ఆమెతో గొడవ పడి, కొట్టి కారులో నుండి తోసివేశాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు హైవే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారని దెందులూరు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి క్రిస్మస్ ఆరాధన పండుగలు



క్రిస్మస్ ఆరాధన పండుగల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మన్నా చర్చి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 11వ తేదీ నుంచి నగరానికి చెందిన మన్నా చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్టమస్ ఆరాధన పండుగలు నిర్వహించనున్నట్లు మన్నా చర్చ్ పాస్టర్ ఎం. జ్యోతిరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ ఈ ఆరాధన పండుగలు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. బిషప్ ఎం.ఎలీషా రాజు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ ఆరాధన పండుగల్లో ప్రముఖ వర్తమానికులు హైదరాబాద్‌కు చెందిన రాజ్ ప్రాష్ పాల్ ప్రధాన వక్తగా వాక్య సందేశమిస్తారని తెలిపారు. ఈ ఆరాధన పండుగల్లో సిస్టర్ జెస్సీ పాల్, ఎం. జ్యోతి రాజు, సునీత జ్యోతిరాజు వాక్యపరిచర్య చేస్తారన్నారు. ఈ పండుగల్లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, వైఎస్ఆర్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. ఈ పండుగల్లో భాగంగా మన్నా చర్చి ఆధ్వర్యంలో 200 మంది క్వాయర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, సంగీత దర్శకులు జేకే క్రిస్టఫర్, బ్రదర్‌బాబీ సంగీత దర్శకత్వంలో ప్రముఖ గాయనీ గాయకులు మధురమైన సంగీత గానాలు చేస్తారన్నారు. దీనితో పాటు మన్నా చర్చి సండే స్కూల్, యూత్ ఆధ్వర్యంలో నాటికలు ప్రదర్శిస్తారని, క్యాండిల్ లైట్ సర్వీస్ జరుగుతుందని తెలిపారు. ఈ ఆరాధన పండుగల్లో నగరంతో పాటు పరిసర ప్రాంతాల క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభువు కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంగా క్రిస్మస్ ఆరాధన పండుగల పోస్టర్లను ఆవిష్కరించారు.

పేద విద్యార్థుల ఉన్నత విద్యకు బాట

- విద్య, వసతి దీవెన పథకాల్లో రూ.7.46 కోట్లు మంజూరు
- 15 గ్రామాల్లో 3,114 మంది విద్యార్థులకు లబ్ధి



కొల్లేరులో సమావేశమైన విద్య, వసతి దీవెన పథకాల అందుకుంటున్న విద్యార్థుల తల్లులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు పేదల ఉన్నత విద్యకు బాటలు వేసాయి. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ రెండు పథకాల ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువు కొనసాగిస్తున్నారు. పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు బీకాం, బీఎస్సీ, బీఏ తదితర డిగ్రీలు చదువుకుంటున్న విద్యార్థులకు ఈ పథకాలు దన్నుగా నిలిచాయి. ఫలితంగా నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకులు సైతం ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారు. హాస్టళ్లలో ఉంటూ ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఈ పథకాలు ఎంతో మేలు చేస్తున్నాయని విద్యావేత్తలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు మేలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన 2019 నుంచి 2023 వరకూ ఈ రెండు పథకాల ద్వారా ఏలూరు రూరల్ మండలానికి చెందిన 15 గ్రామాల్లో 3,114 మంది లబ్ధి పొందారు. విద్యాదీవెన ద్వారా 1,839 మంది విద్యార్థులు రూ.5,43,63,948 అందుకున్నారు. వసతి దీవెనతో 1,275 మంది రూ.2,02,68,936 లబ్ధి పొందారు. మొత్తంగా రెండు పథకాల ద్వారా రూ.7,46, 32,884 ప్రభుత్వం లబ్ధిదారులకు ఖాతాల్లో జమ చేసింది. లబ్ధిదారుల్లో ఒక్కొక్కరూ ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్థిక సహాయం పొందిన వారు ఉన్నారు.

గ్రామాల వారీగా విద్యా, వసతి దీవెన పథకాల లబ్ధిదారుల వివరాలు (రూపాయల్లో)

గ్రామం	విద్యాదీవెన (రూ)	వసతిదీవెన (రూ)	లబ్ధిదారులు
చాటపర్రు	1,11,16,580	4,0 65,321	622
పైడిచింతపాడు	24,40,716	7,63,005	160
ప్రత్తికోళ్లలంక	34,0,7708	13,37,067	242
కెడిపురం	10,40,346	4,22,079	69
కోమటిలంక	11,94,469	4,24,395	77
శ్రీపర్రు	54,40,720	18,53,995	318
పెదయాగనమిల్లి	5,47,636	,89,400	40
గుడివాకలంక	32,33,025	14,64,742	239
జాలిపూడి	88,61,385	37,0 3824	521
మల్కాపురం	72,18,770	25,54,660	335
మాదేపల్లి	98,62,310	34,90,448	491

పేదలకు ఉన్నత విద్య అందించారు



ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు అండగా ఉంటున్నాయి. వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా నాలుగేళ్లలో మా గ్రామానికి రూ.7.37 లక్షలు మంజూరయ్యాయి. ఈ డబ్బు అందుకోవడం వల్ల గ్రామంలో యువతీ, యువకులు ఉన్నత విద్యావంతులు అవుతున్నారు. ఇలాంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయి.

– బలే నాగరాజు, పెదయాగనమిల్లి

మా జీవితాల్లో మార్పు వచ్చింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వసతి దీవెన పథకం నా బిడ్డకు ఎంతో అండగా నిలిచింది. మా కుటుంబాన్ని ఆదుకుంది. ఏటా వస్తున్న రూ.పది వేలతో నా బిడ్డ చదువు సాఫీగా సాగిపోతోంది. పేదలు పెద్ద చదువులు చదువుకోవాలనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి జగనన్న ఈ పథకం అమలు చేస్తున్నారు. ఆయనకు నా ధన్యవాదాలు.

– యద్ల లక్ష్మి, వెంకటాపురం

మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ జ్యోతి కోరారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1948లో ఐక్యరాజ్య సమితి డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవం ఏర్పాటు చేసిందని గుర్తు చేసారు. మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ మానవ హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల చైర్మన్ కె.డోమినిక్, డిబిఆర్‌సి సిటీ కో-ఆర్డినేటర్ బలే సురేష్, మహిళా నాయకురాలు ఆర్‌పీ రమాదేవి, మౌనిక పాల్గొన్నారు.